జగజ్జననీ.. శక్తి స్వరూపిణి

ప్రొద్దుటూరు కల్చరల్ : దేవి శరన్నవరాత్రుల్లో రెండో రోజు అయిన మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో భవానిదేవిగా భక్తులకు కనులవిందు చేశారు. రతనాల వేంకటేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి ఆలయం, ముక్తిరామ లింగేశ్వరస్వామి ఆలయంలో భవానిదేవి, సత్యనారాయణస్వామి ఆలయంలో బ్రాహ్మణీదేవి, మోడంపల్లె పెద్దమ్మ తల్లి ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవి, సూపర్‌బజారు రోడ్డు చౌడేశ్వరిదేవి, శివాలయంలో మంగళగౌరి భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు.


ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్నకేశవ స్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవి


సత్యనారాయణ స్వామి ఆలయంలో బ్రాహ్మణీదేవి



మైదుకూరు: గాయత్రి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


బద్వేలు అర్బన్ : అమ్మవారిశాలలో రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు


పోరుమామిళ్లలో గాయత్రీదేవిగా వాసవీమాత


బ్రహ్మంగారిమఠం: బాలా త్రిపుర సుందరీదేవీగా ఈశ్వరీమాత


కలసపాడు: పార్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


ఖాజీపేట : మోహినీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

దుప్పట్లు పంపిణీ

బద్వేలు అర్బన్ : దసరా పండుగను పురస్కరించుకుని వాసవీ, వనితక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండు ఆవరణలో అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవిక్లబ్ ఐసీ ఆఫీసర్ కొండపల్లి వెంకట సుభాష్‌కుమార్, ఆర్య వైశ్య వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు కె.వి.సుబ్బారావు మాట్లాడుతూ అనాథలను ఆదుకోవడం అభినందనీయమని అన్నారు. వాసవీక్లబ్ అధ్యక్షుడు అనుముల శెట్టిసిద్దయ్య, సెక్రటరీ బచ్చు సందీప్, ట్రెజరర్ సుమంత్, వనితక్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి, సెక్రటరీ వసుంధర, ట్రెజరర్ పద్మావతి, వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ సుధాకర్, గురుప్రసాద్, చాటకొండు వెంకటసుబ్బయ్య,భార్గవ్, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

నిస్సిగ్గుగా అబద్ధాలు

మంత్రి లోకేష్‌పై డి. ఆదిత్యరెడ్డి ధ్వజం



అట్లూరు : ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై శాసనమండలిలో మంత్రి లోకేష్ నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని వైఎస్సార్సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి తప్పుబట్టారు. మంగళవారం పోరిమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోందని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4 వేల కోట్ల బకాయిలు పెట్టిందంటూ లోకేష్ చెబుతున్నారని, దమ్ముంటే ఆ వివరాలు బయటపెట్టాలని సవాలు విసిరారు. వాస్తవానికి 2019లో చంద్రబాబు పాలనలోనే రూ.2,400 కోట్ల బకాయిలు మిగిలిపోయాయని, 2020 మార్చికల్లా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హయాంలో ఆ బకాయిలన్నీ తీర్చిందని స్పష్టం చేశారు. అంతేకాదు జగన్ హయాంలో రూ.4,500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించారని గుర్తు చేశారు. కూటమి పాలనలో మాత్రం విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ చేయకుండా, నేరుగా కాలేజీలకు ఇస్తామని జీవో ఇచ్చి, అది ఎక్కడా అమలు కాలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోతే విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని అన్ని రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తారని ఆమె పేర్కొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి


ధన్వంతరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ అపర్ణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జిల్లా ఆస్పత్రిలోని ఆయుర్వేద వైద్యశాలలో మంగళవారం, ధన్వంతరి జయంతి సందర్భంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యురాలు అపర్ణ శ్రీరాం మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంతో ప్రజలందరూ సంపూర్ణ ఆయురారోగ్యాలతో సంతోషకరమైన ఉండాలని ఆకాంక్షించారు. యునాని వైద్యుడు నిరంజన్‌నాయక్, ఆయుర్వేద కాంపౌండర్ అంకాల్‌రెడ్డి, మహేశ్వరయ్య, శ్రీను, ఎమ్ఎన్ఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

అధిక వడ్డీలకు అప్పలిస్తే చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : అధిక వడ్డీలకు అప్పు ఇచ్చి బాకీ దారులను వేధిస్తే చర్యలు తప్పవని రూరల్ సీఐ నాగభూషణం హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు డీఎస్పీ భావన ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని స్టేషన్‌ల పరిధిలో ఉన్న పలు వడ్డీ వ్యాపారుల ఇళ్లలో మంగళవారం రాత్రి సీఐలు, ఎస్ఐలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. గతంలో జరిగిన పలు ఘటనలను దృష్టిలో ఉంచుకొని, నాలుగు రోజుల క్రితం వడ్డీ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి హత్యకు గురైన నేపథ్యంలో వడ్డీ వ్యాపారుల ఇళ్లలో దాడులు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు.

కమలకూరు సర్పంచు మృతి


పెద్దసుబ్బయ్య (ఫైల్)

అట్లూరు: మండల పరిధిలోని కమలకూరు సర్పంచు చిట్టిబోయిన పెద్దసుబ్బయ్య (66) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. పెద్దసుబ్బయ్య అనారోగ్యంతో హైదరాబాదులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే సోమవారం రాత్రి ఆరోగ్యం విషమించడంతో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. సుబ్బయ్య మృతికి పలువురు సంతాపం తెలిపారు.

పూడికతీత పనులు

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెంలో మురికి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు. గ్రామ పంచాయితీ కార్యదర్శి ఫణీంద్ర ఆధ్వర్యంలో జేసీబీతో గ్రామంలోని పలు వీధుల్లో పూడిక తీత పనులు చేపట్టారు.

వరిలో లైన్ సోయింగ్ పాటించాలి

మైదుకూరు : వరి పంటలో లైన్‌సోయింగ్ పద్ధతి పాటించడం మేలని మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని అన్నలూరు, సోమయాజులపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అధికారులకు శిక్ష తప్పదు

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తప్పవని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన మంగళవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ చెడు మాట్లాడొద్దు, చెడు వినొద్దు, చెడు చూడొద్దు అంటే టీడీపీ నాయకులైన ఎమ్మెల్యే కుమారుడు కొండారెడ్డి చెడు మాట్లాడుతున్నారని, ఈవీ సుధాకర్‌రెడ్డి చెడు వింటున్నారని, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య కళ్లప్పగించి చూస్తున్నారని ఫొటోను ప్రదర్శించారు. రాజ్యాంగాన్ని అవమానపరచొద్దని, ఓటు వేసి గెలిపించిన ప్రజలను అవహేళన చేయొద్దని తాను రెండు రోజుల క్రితం చెబితే తాను ఇలానే చేస్తానని కొండారెడ్డి నిస్సిగ్గుగా తిరుగు సమాధానం ఇచ్చారని తెలిపారు. రాజ్యాంగంపై ఆయనకు ఉండే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తే ప్రజలే గుణపాఠంచెబుతారన్నారు. అధికారం ఉన్నప్పుడు మాత్రమే కొండారెడ్డి ప్రొద్దుటూరులో ఉంటారని, లేకుంటే హైదరాబాదుకు మకాం మార్చుతారని ఎద్దేవాచేశారు. తాను కౌన్సిలర్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రొద్దుటూరులో ఉన్నానని, కౌన్సిలర్‌గానే వరదరాజులరెడ్డితో పోటీ పడ్డానని తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి ఏనాడు ప్రొటోకాల్‌ను ఉల్లంఘించలేదన్నారు.

జైలుకు పంపిస్తాం

తాను హెచ్చరించినా పట్టించుకోకుండా కొండారెడ్డి కూర్చోబెట్టి సమావేశం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్‌ను తప్పక జైలుకు పంపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్‌యాదవ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, పట్టణాధ్యక్షులు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సలర్లు వరికూటి ఓబుళరెడ్డి, గుర్రం లావణ్య, రాగుల శాంతి, గరిశపాటి లక్ష్మీదేవి, సత్యం, పాతకోట మునివంశీధర్‌రెడ్డి, బలిమిడి వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపురెడ్డి, పన్నీటి కాశయ్య, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షులు జంగమయ్య, నాయకులు ఎర్రిపోతుల సుధాకర్, బీఎస్ఆర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని పట్టించుకోని 'కూటమి'

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని పట్టించుకోవడం లేదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులపై పైసా భారం లేకుండా అండగా నిలిచిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించి రైతులను నట్టేట ముంచిందని అన్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు గ్రామస్థాయిలో రైతులకు చేదోడువాదోడుగా ఉన్న రైతుభరోసా కేంద్రాలతో పాటు సచివాలయాలను నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేకపోవడం దారుణమన్నారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్, ఏరియా కమిటీ సభ్యులు రామరాజు, బాబు, జయరామరాజు, చంద్రపాల్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలతో మహిళలకు మెరుగైన సేవలు

ప్రొద్దుటూరు క్రైం : వైద్య శిబిరాలతో మహిళలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను పట్టణవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం. పెంచలయ్య మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో వ్యాధి నిర్ధారణ, పోషకాహారం, టీబీ స్క్రీనింగ్, అనిమియా పరిశీలన తదితర వాటిని స్పెషలిస్టు వైద్యులు పరిశీలిస్తారని చెప్పారు. స్టేట్ నోడల్ ఆఫీసర్లు డాక్టర్ సుప్రితరాజ్, డాక్టర్ ఎస్ఎం. రెడ్డి, డీఎస్ఓ రమేష్‌రెడ్డి, స్పెషలిస్టు వైద్యులు పవన్‌కుమార్‌రెడ్డి, తేజేశ్వరి, అనూష, ఆప్తాల్మిక్ ఆఫీసర్ కేజే రఘురామిరెడ్డి, మెడికల్ ఆఫీసర్లు హిమబిందు, మౌనిక, భరత్ కుమార్, మధుకుమార్, మోహన్‌కాంత్, డీపీఎంఓ శివశంకరయ్య, ఎంపీహెచ్ఎస్ రాజారత్నం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎంవీసుబ్బారెడ్డి, జ్యోతి, అంగన్‌వాడి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బి.కోడూరు : బి.కోడూరు పీహెచ్‌సీ పరిధిలోని పాయలకుంట్ల విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని సర్పంచ్ ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ ప్రజలందరూ ఈ కార్యక్రమంలో నిర్వహించే క్యాన్సర్ పరీక్షలు, పోషణ అభియాన్, గర్భిణులకు పరీక్షలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ జాన్‌విలియం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియదర్శిని, ఏఎన్ఎం చైతన్యకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు సునీత, నారాయణమ్మ, ఆశా కార్యకర్తలు రమాదేవి, దుర్గమ్మ, ఆశీర్వాదమ్మ పాల్గొన్నారు.

పంట సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

బి.కోడూరు : పంట సాగులో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. మండలంలోని రామసముద్రం, ఆనంవారిపల్లె గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి వరిపంటను పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఖరీఫ్ 2025లో పంట సాగు చేసిన రైతులు ఈ నెల 30వ తేదీలోపు పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. వరిపంటలో సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. అలాగే వివిధ పథకాల గురించి అవగాహన కల్పించారు. మండలంలోని మున్నెల్లిలో యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్సిడీపై జిప్సం రైతులకు అందించడం జరుగుతుందని, అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వీపీఏ షణ్ముఖ్ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలతో యూరియా తీసుకెళ్లవచ్చు

చాపాడు: కౌలుకు భూమి సాగు చేసుకుంటూ కౌలు కార్డు లేని రైతులు పంట నమోదు ధ్రువీకరణ పత్రాల ద్వారా యూరియా, ఇతర ఎరువులను పొందవచ్చని మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత తెలిపారు. మండలంలో కౌలుకు భూమి తీసుకుని సాగు చేసుకుంటూ కౌలు కార్డు లేని రైతులు సంబంధిత భూమి వివరాలను తమ గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో తెలియజేస్తే సంబంధిత అగ్రికల్చర్ అసిస్టెంటు ధ్రువీకరపత్రాలు ఇస్తారన్నారు. వీటి ద్వారా రైతు సేవా కేంద్రాలతో పాటు ప్రైవేటు దుకాణాలలో ఎరువులను పొందవచ్చని మండల వ్యవసాయాధికారి తెలియజేశారు.